'పహల్గాం ఎటాక్' పేరుతో డిజిటల్ అరెస్టు

- టార్గెట్‌గా మారిన నగరానికి చెందిన వృద్ధుడు
- నకిలీ అరెస్టు వారెంట్, కోర్టు ఉత్తర్వులూ షేరింగ్
- మొత్తం రూ.26.6 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- సిటీ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరుతో వృద్ధులతో సహా అనేక మందిని భయపెట్టి నిలువు దోపిడీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు తాజాగా పహల్గాం ఉగ్రదాడినీ వాడేస్తున్నారు. నగరానికి చెందిన ఓ వృద్ధుడికి (68) ఫోన్లు చేసిన కేటుగాళ్లు ఏకంగా రూ.26.06 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హుమాయున్‌నగర్‌కు చెందిన బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి కేసులో ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఆ ఉగ్రవాదులకు నిధులు అందించిన ఆరోపణలతో వృద్ధుడిపై కేసు నమోదైనట్లు భయపెట్టారు. ఆపై వీడియో కాల్ చేసిన కేటుగాళ్లు నకిలీ అరెస్టు వారెంట్‌తో పాటు మరికొన్ని బోగస్ డాక్యుమెంట్లు కూడా చూపించారు. ఓ దశలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ), యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) పేర్లూ వాడేశారు. ఆ ఉగ్రవాదులతో, నిధులతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బాధితుడు చెప్పగా..డిజిటల్ అరెస్టు చేశామని, నిర్దోషిత్వం నిరూపించుకోకపోతే అరెస్టు తప్పదని పేర్కొన్నారు. నిర్దోషిత్వం నిరూపించుకోవడానికి తాము చెప్పిన మొత్తం బదిలీ చేయాలని, కేసు ఎత్తేసిన తర్వాత దాన్ని రిఫండ్ ఇస్తామని నమ్మబలికారు. దీనికి సంబంధించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జారీ చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ వ్యవహారం తేలే వరకు డిజిటల్ అరెస్టులో ఉండాలని, విషయం ఎవరికీ చెప్పకూడదని షరతు విధించారు. సైబర్ నేరగాళ్ల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొన్న బాధితుడు కొటక్ మహీంద్ర, ఆర్‌బీఎల్ బ్యాంకుల్లో ఉన్న తన ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దు చేసి రూ.6.06 లక్షలు కేటుగాళ్లు చెప్పిన ఖాతాల్లోకి బదిలీ చేశారు. అప్పటికీ వారి నుంచి ఒత్తిడి తగ్గకపోవడంతో తన భార్య ఖాతాలో ఉన్న రూ.20 లక్షలూ బదిలీ చేశారు. నగదు వెళ్లిన ఖాతా హెంట్రీ జోన్స్ పేరుతో ఉన్నాయి. అయినప్పటికీ వేధింపులు తప్పలేదు. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు టోల్ ఫ్రీ నెం.1930 ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

బతుకమ్మ ఆత్మీయతకు ప్రతీక



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో జిల్లా యంత్రాంగం తరపున మంగళవారం జిల్లా పంచాయతీరాజ్, ఉద్యానవన, తూనికలు కొలతలు, కార్మిక, హౌజ్ కీపింగ్ ఆధ్వర్యంలో బతుకమ్మ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.'బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక నిలుస్తుందని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాధిక అన్నారు. కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళా సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక అన్నారు.బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచికగా నిలుస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. కార్యక్రమంలో వివిధ శాఖల మహిళా అధికారులు , ఉద్యోగులు, కలెక్టరేట్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

ఓపిఎం మాదక ద్రవ్యాన్ని అమ్ముతున్న వ్యక్తి అరెస్టు


బీరారం చౌదరి

మూసాపేట: నిషేధిత మాదక ద్రవ్యం ఓపిఎంను అమ్ముతున్న ఓ వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... షికార్‌గఢ్, జోథ్‌పూర్, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన బీరారం చౌదరి (36) కూకట్‌పల్లి, భాగ్యనగర్ కాలనీ, జయనగర్‌లో జిలేబి, సమోసా సెంటర్ పెట్టి వ్యాపారం చేస్తుంటాడు. నిషేధిత మాదక ద్రవ్యం ఓపిఎంను అమ్ముతున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మంగళవారం దాడి చేశారు. అతడి నుంచి 55 గ్రాములు, మరో ప్యాకెట్‌లో 50 గ్రాముల ఓపిఎం డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించారు.

కరుణ రెడ్డికి డాక్టరేట్



కేపీహెచ్‌బీకాలనీ: జనగాం జిల్లా బచ్చన్న పేట మండలం, కట్కూర్ గ్రామవాసి కరుణ రెడ్డి కూకట్‌పల్లిలో జేఎన్‌టీయూహెచ్‌లో కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించారు. ఇంటర్నేషనల్ జర్నల్స్ పబ్లికేషన్స్‌లో ప్రచురణ పొంది పీహెచ్‌డి థీసెస్ సమర్పించారు. 'డిజైన్, సింథసిస్ అండ్ కారక్టరైజేషన్ ఆఫ్ ఇండోల్, థైజోలోపైరిడిన్ బేసిడ్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్ అండ్ దెయిర్ బయోలాజికల్ స్టడీస్' అనే అంశంపై ప్రొఫెసర్ చిట్టిరెడ్డి వెంకటరమణ రెడ్డి పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. 14వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా తీసుకోనున్నారు. కరుణ రెడ్డి జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో ఎంఎస్‌సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. 7వ స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ తీసుకుంది. యూనివర్సిటీ టాపర్ కావడంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమై ఇన్‌స్పైర్ ఫెలోషిప్ అవార్డు కోసం సెలక్ట్ చేశారు. కరుణరెడ్డి భర్త, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, జేఎన్‌టీయూహెచ్ జాక్ రాష్ట్ర చైర్మన్ డా. శాడగొండ కరుణాకర్‌రెడ్డి కూడా మ్యాథమెటిక్స్‌లో పట్టా పొందారు. భార్యా భర్తలు ఇద్దరు జేఎన్‌టీయూహెచ్ నుంచి పట్టాలు తీసుకోవటం విశేషం. పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు, యువతులు బతుకమ్మలను ఒక వేదిక వద్దకు చేర్చి చుట్టు ఆడుతూ, పాడుతూ సందడి చేశారు. సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు బతుకమ్మల వద్ద ఆటా పాటలతో ఆకట్టుకున్నారు. కొలనులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం ఫలహారాలను ఇచ్చి పుచ్చుకున్నారు. – కూకట్‌పల్లి


ఆంజనేయనగర్‌లో.. కార్పొరేటర్‌లు శిరీష బాబూరావు, సబిహా బేగం, ఉద్యోగులు


కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న కవలలు


ఈనాడు కాలనీ వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి


ఈనాడు కాలనీలో అందరూ కలిసి ఏర్పాటు చేసిన పెద్ద బతుకమ్మ


మూసాపేటలోని శ్రీహరి నగర్‌లో బతుకమ్మ ఆడి నిమజ్జనం చేయడానికి వెళ్తున్న మహిళలు


కూకట్‌పల్లిలోని హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మాజీ కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది అవంతి నగర్ తోటలోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి సత్యనారాయణను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, తిరుపతిరావు, సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కల్యాణినగర్లో జోనల్ కమిషనర్ పర్యటన



బాలానగర్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి కల్యాణినగర్ రెండుసార్లు వరద తాకిడికి గురైంది. సమస్య తీవ్రతను అంచనా వేసేందుకు మంగళవారం జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు కాలనీ వాసులు తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా నాలా సమస్యను పరిష్కరించాలని, ఘాటు వాసనలు వస్తున్నాయని తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని కాలనీ వాసులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు వి. వసంతరావు, జనరల్ సెక్రటరీ జి. నాగరాజు, కిషోర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



కనకదుర్గ ఆలయంలో కన్యాకుమారిగా ..



శ్రీసాయిబాబా ఆలయంలో అమ్మవారి పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు, బాబూరావు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో దసరా నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పలు దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు, పలు పార్టీల నాయకులు, భక్తులు ఆలయాలకు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.



మూసాపేట అంబేద్కర్ నగర్‌లోని అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు



కేపీహెచ్‌బీకాలనీలోని పీవీఎస్ఆర్ పార్కులో మహిళా భక్తులు

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: పల్లె దవాఖానాల ద్వారా లభించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న పల్లె దవాఖానాను కమిటీ హాల్ పునర్నిర్మాణం చేపట్టడంతో అవంతినగర్ తోటలోని మహిళా భవనంలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల ప్రేమతో, ఆప్యాయంగా పలకరించి వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పల్లె దవాఖానాలో ముఖ్యంగా గర్భిణులకు, మహిళలకు, చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తారని అన్నారు. త్వరలో పల్లె దవాఖానాలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్‌వీ దుర్గ, కోఆర్డినేటర్ సత్తి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి తన్నీరు తిరుపతిరావు, సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, నాయకులు మల్లారెడ్డి, వెంకటయ్య, దత్తాత్రేయ, నారాయణ పాల్గొన్నారు.



దవాఖానాలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

మోతీనగర్: డివిజన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాణా ప్రతాప్ నగర్, కేఎస్‌నగర్, ఆర్‌కె సొసైటీ ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ డీఈ శ్యామ్‌కుమార్, ఏఈ రాకేష్ గౌడ్, సిబ్బందితో కలసి బస్తీ బాట చేపట్టారు. విద్యుత్ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్‌టీ లూస్ లైన్స్ సరి చేయటం, విరిగిన పోల్స్ స్థానంలో కొత్త పోల్స్ ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, ఇంటిపై నుంచి వెళ్లే విద్యుత్ లైన్ల మార్పు వంటి సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, కో ఆర్డినేటర్ వీరారెడ్డి, షేక్ సుబాన్, అబ్దుల్ రజాక్, మాధవాచారి, వెంకటేష్, శివ, యోగిరాజు, చాంద్‌మియా, బాలరాజ్, లింగం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సబిహాబేగం, అధికారులు

పట్నం మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



పట్నం మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న శేరి సతీష్ రెడ్డి, దేవరింటి మస్తాన్ రెడ్డి

మోతీనగర్: శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ కూకట్‌పల్లి మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీటీం అధ్యక్షుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి వారి అనుచరులతో కలిసి ఆయనను సన్మానించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పవన్‌కుమార్, శర్మ, శాం సుందర్, రమేష్ ఆచారి పాల్గొన్నారు.

ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలో బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని కార్పొరేటర్ దొడ్లవెంకటేష్ గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబీర్ చెరువు కట్ట మీద అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు శివమ్మ కాలనీ, రామాలయం దగ్గర, అంబీర్ చెరువు కట్ట మీద బుతకమ్మ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. అదే విధంగా అక్టోబర్ 2 గురువారం సాయంత్రం 6 గంటలకు శివమ్మ కాలనీ, రామాలయం దగ్గర, అంబీర్‌చెరువు కట్టమీద ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ బస్తీ బాట పట్టింది. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ మంగళవారం నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్, సఫ్దార్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి విస్తతంగా పర్యటించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ లైన్లు, వీధి దీపాల సుందరీకరణ, మొక్కలు నాటడం, మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన బస్తీ వాసులతో విస్తృతంగా చర్చించారు. సఫ్దార్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగు నీరు పారుదలకు ఇబ్బంది ఎదురవుతోందని, మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు వివరించారు. మంజీరా పైపులైన్ల మధ్య ప్రాంతాన్ని సుందరీకరణ చేయాలని కోరారు. ఆయా సమస్యలపై వాటర్ వర్క్స్ జీఎం, సంబంధిత అధికారులతో రమేష్ ఫోన్‌లో మాట్లాడి వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, హుస్సేన్, వాజిద్ పాషా, మొయినుద్దీన్, విఠల్ రెడ్డి, జమీర్, అహ్మద్, రఫీ, కరీం, ఇమ్రాన్, గోపాల్ రెడ్డి, పల్లపు వేణు, మోయిజ్, యాదగిరి, సాయి, తులసి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

కార్మికులకు బీమా కార్డులు అందజేత

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర కార్మికులైన 200 మందికి జీవిత బీమా కార్డులను అందజేయడం సంతోషంగా ఉందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్మాణ కార్మికులను ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల బీమా వర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్, గోపి నాయక్, ఆర్ వెంకట్, రవి, దరావత్ శ్రీను, స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు సరికాదు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డ్రైనేజీ సమస్యతో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ప్రశ్నించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అబ్రహర్‌నగర్‌లో పర్యటించారు. వాటర్ వర్క్స్ అధికారులను పిలిపించి డ్రైనేజీలను క్లీన్ చేయించారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, మేకల హరినాథ్, బాబా, సాయి, అనీఫ్, అజీమ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, సజ్జు పాల్గొన్నారు.



బీమా కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

పనులను నాణ్యతతో పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ హిందూ శ్మశాన వాటికలో జరుగుతున్న వివిధ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశానవాటికలో జరుగుతున్న నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. త్వరలో ఈ శ్మశాన వాటికను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, జి. రవి, మల్లేష్, షౌకత్ ఆలీ మున్నా, ముజీబ్, అగ్రవాసు, మహేష్, సిద్ధయ్య, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.